క్లుప్తంగా

నేడు 'వేద'లో స్వర్ణప్రాశన

జనగామ: జిల్లా కేంద్రం హైదరాబాద్ రోడ్డు లోని వేద ఆయుర్వేదిక్ పంచకర్మ వెల్ నెస్ సెంటర్‌లో నేడు(శుక్రవారం) ఉచిత స్వర్ణ ప్రాశన కార్యక్రమం ఉంటుందని డాక్టర్ అంజిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 7 నుంచి రాత్రి 7 గంటల వరకు పిల్లలకు స్వర్ణ ప్రాశన వేస్తామన్నారు. ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యార్థినికి సన్మానం



దేవికను సత్కరిస్తున్న హెచ్‌ఎం మరియ జోసెఫ్

జనగామ: జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో జాతీయ స్థాయిలో 514వ ర్యాంకు సాధించిన పట్టణంలోని నెహ్రూపార్కు ఏరియా సెయింట్ పాల్స్ స్కూల్ పూర్వ విద్యార్థిని బానోత్ దేవికను హెచ్‌ఎం మరియ జోసెఫ్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సత్కరించారు. దేవిక తమ పాఠశాలలో విద్యను అభ్యసించి ఇంతటి ఘనత సాధించినందుకు ఎంతో గర్వంగా ఉందన్నారు. జీవితంలో లక్ష్యం పెట్టుకుని కష్టపడి చదివితే ఉన్నత స్థానాలకు చేరుకోవడం సులభం అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నియామకం


విష్ణువర్ధన్

చిల్పూరు: జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా చైర్మన్‌గా శ్రీపతిపల్లి గ్రామానికి చెందిన పాగాకుల విష్ణువర్ధన్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం జాతీయ చైర్మన్ డాక్టర్ మహ్మద్ యాసిస్, రాష్ట్ర చైర్మన్ బద్దిబడిగ శ్రీనివాస్‌రెడ్డిలు ప్రకటించారు.

ట్రాక్టర్ కేజ్‌వీల్స్‌తో రోడ్డుపై వెళ్తే చర్యలు



నవీన్‌కుమార్, ఎస్సై

చిల్పూరు: ట్రాక్టర్ యజమానులు కేజీవీల్స్‌తో బీటీ రోడ్డుపై వెళ్తే చర్యలు తప్పవని ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ అన్నారు. గురువారం సాక్షి దినపత్రికలో చర్య తీసుకోవాలి శీర్షికన ప్రచురితమైన కథనానికి ఎస్సై స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజీవీల్స్‌తో బీటీ రోడ్డుపై వెళ్తే మొదటి సారి రూ. 5వేలు, రెండో సారి రూ. 15 వేలు, మూడోసారి కూడా అలాగే చేస్తే ట్రాక్టర్ సీజ్ చేయడంతో పాటు యజమానిపై కేసు నమోదు చేస్తామన్నారు. ట్రాక్టర్ కేజ్‌వీల్స్‌తో రోడ్డుపై తిప్పడం వల్ల రోడ్డు ధ్వంసం అవుతుందన్నారు. మండలంలో ఎక్కడైనా రోడ్లపై ట్రాక్టర్ కేజీవీల్స్ కనిపిస్తే సమాచారం అందివ్వాలని అన్నారు.

తరిగొప్పుల: ట్రాక్టర్ యాజమాన్యం బీటీ, సీసీ రోడ్డుపై కేజీవీల్స్ బిగించిన ట్రాక్టర్లను నడిపితే చర్యలు తప్పవని ఎస్సై గుగులోత్ శ్రీదేవి హెచ్చరించారు. ట్రాక్టర్లు కేజ్ వీల్స్‌తో బీటీ, సీసీ రోడ్లపై నడపడంతో రోడ్లు ధ్వంసం అవుతున్నాయని అందుకు ప్రత్యామ్నాయంగా కేజ్ వీల్స్‌కు ఇనుప పట్టీలు ఏర్పాటు చేసుకోవడం లేదా పొలం వద్దకు వెళ్లిన తరువాతే కేజ్ వీల్స్ వినియోగించడం చేయాలని సూచించారు.

గ్రామ సభల ద్వారా ఇళ్లు కేటాయించాలి

దేవరుప్పుల: నిరుపేదలకు గ్రామ సభల ద్వారా మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పల్ల సుందర్‌రామిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలోఎంపీడీఓ కె.లక్ష్మీనారాయణకు ఇందిరమ్మ కమిటీలు రద్దు చేస్తూ గ్రామ సభల ద్వారానే నిలువనీడ లేని పేదలకు ఇళ్లు కేటాయించాలని వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా పేదలకు మంజూరు చేయాల్సిన ఇళ్లు కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు కేటాయించుకోవడం శోచనీయమన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు తీగల దయాకర్ ,మండల నాయకులు బస్వ మల్లేషమ్, ఏల సోమసుందర్ పాల్గొన్నారు.

సెప్టిక్ ట్యాంకులో పడి పాడి గేదె మృతి

జఫర్‌గఢ్: ప్రమాదవశాత్తు సెప్టిక్ ట్యాంకులో పడి పాడి గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని ఓబులాపూర్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మొగులుగాని రవికి చెందిన పాడి గేదె మేతకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు సెప్టిక్ ట్యాంకులో పడి అక్కడికక్కడే మృతి చెందింది. రూ.50 వేల విలువ చేసే పాడి గేదె మృతి చెందడంతో బాధిత రైతు నష్టపోయాడని, ప్రభుత్వ పరంగా సాయం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

- పట్టించుకోని అధికారులు
- న్యాయం చేయాలని బాధిత రైతు వేడుకోలు


ట్రాన్స్‌ఫార్మర్‌ను చూపిస్తున్న బాధిత రైతు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని పాంనూర్ గ్రామంలో పొన్న రమేశ్‌కు చెందిన వ్యవసాయ భూమిలో ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో గత కొన్ని సంవత్సరాలుగా సదరు రైతు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వారికి ఉన్న ఎకరం వ్యవసాయ భూమి మధ్యలో ట్రాన్స్‌ఫార్మర్ ఉండగా తీవ్ర ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారు. ఈ మేరకు పొన్న రమేశ్, పొన్న సాంబరాజు తమ వ్యవసాయ క్షేత్రంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ వివరాలు తెలిపారు. తమ వ్యవసాయ భూమిలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి దాదాపు 20 మంది రైతులకు వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయని, వాటితో దాదాపు 60 ఎకరాల్లో సాగుచేస్తున్నారన్నారు. కాగా, తమ భూమిలో ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో వ్యవసాయ పనులు చేసేందుకు కూలీలు రావడం లేదన్నారు. దున్నకాలు, వరినాట్లు నుంచి మొదలుకొని వరికోతల వరకు సదరు ట్రాన్స్‌ఫార్మర్‌తో ఇబ్బందిగా ఉందని, గతంలో విద్యుత్ ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయన్నారు. ప్రధానంగా వరికోత సమయంలో హార్వెస్టర్ మిషన్ రావడానికి భయపడుతున్నారని వాపోయారు. ట్రాన్స్‌ఫార్మర్ సమస్యపై పలుమార్లు స్థానిక లైన్‌మన్, ఏఈకి పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని, ఈ విషయమై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో తమకు ఆత్మహత్యే శరణ్యమని వారు వేడుకుంటున్నారు.

ఏఐతో విద్యార్థులకు మేలు

- ఎంఈఓ మడిపెల్లి ఐలయ్య


ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎంఈఓ ఐలయ్య

నర్మెట: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో విద్యార్థులకు మేలు కలుగుతుందని ఎంఈఓ మడిపెల్లి ఐలయ్య అన్నారు. మండలకేంద్రంలోని ఎంపీపీఎస్‌లో గురువారం ఎఫ్ఎల్ఎన్, ఏఎక్స్ఎల్ (ఏఐ) ల్యాబ్‌ను ప్రారంభించిన ఆయన మాట్లాడారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో పలు మార్పులు చేస్తోందని ఆదిశగా అడుగులు వేయాలని తదనుగుణంగా ఉపాధ్యాయులు బోధన చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంతో 3, 4, 5 తరగతుల విద్యార్థులకు అభ్యసన సామర్థ్యాలు మెరుగు పడతాయని అన్నారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం నీలం వేణు, పీఎస్ హెచ్‌ఎం కొల్లూరు లక్ష్మి, ఉపాధ్యాయులు పవన్ కుమార్, శౌరీలు, రాజ సులోచన, బైరగోని దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

కుల అసమానతలపై పోరాడాలి

- కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు



మాట్లాడుతున్న స్కైలాబ్ బాబు

లింగాలఘణపురం: పేదల ఐక్యతకు ఆటంకంగా ఉన్న కుల అసమానతలపై పోరాడాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు అన్నారు. గురువారం మండలంలోని వనపర్తిలోని ఓ ఫంక్షన్ హాలులో కేవీపీఎస్ జిల్లా స్థాయి శిక్షణ తరగతులు జిల్లా అధ్యక్షుడు తూటి దేవదానం అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మనుధర్మ శాస్త్రాల పేరుతో మానసిక చట్టాలు చేసి దేశాన్ని ఆధ్యాత్మిక దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. పెట్టుబడిదారులు, భూస్వాములు కుల వ్యవస్థను పెంచి పోషిస్తున్నారని, కింది కులాలను ఉన్నత కులాలు హీనంగా చూస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులపై దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కార్యదర్శి బొట్ల శేఖర్, ఉపాధ్యక్షుడు ఉప్పలయ్య, లలిత, యాదగిరి, శ్రవణ్, మనోహర్, సుల్తానా, లక్ష్మి, పద్మ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ


దుప్పట్లు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

జనగామ రూరల్: మండలంలోని పసరమడ్ల క్రాస్ వద్ద గల ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు దుప్పట్లు, ట్రంక్ బాక్స్, నోట్ బుక్స్, టవల్స్, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సరోజన, స్టాఫ్ సెక్రటరీ బి.వాసు మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలలో గిరిజన విద్యార్థులకు అన్ని ఫ్రీగా పంపిణీ చేయడం జరుగుతుందని.. తల్లిదండ్రులు గమనించి పిల్లలను ఆశ్రమ పాఠశాలలో చేర్పించాలని కోరారు. పాఠశాలలో నాణ్యమైన చదువుతో పాటు రుచికరమైన భోజనం అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హరిచంద్, రతన్ సింగ్, జయరాం, ఉపేందర్, రాములు, వీరన్న, పరమేశ్వర్, సారయ్య, స్వరూప, స్వాతి పాల్గొన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎండీ షబానా

జనగామ రూరల్: అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎండీ షబానా అన్నారు. గురువారం జిల్లా అధ్యక్షురాలు ఇర్రి అహల్య అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు మాత్రమే ఇళ్లు ఇస్తారని అంటున్నారని, దీనిపైన రీ సర్వే చేసి అర్హులను గుర్తించి పేదలకే ఇళ్లు ఇవ్వాలన్నారు. అలాగే కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా సహాయ కార్యదర్శులు మోకు భవాని, పందిళ్ల కల్యాణి, జిల్లా కమిటీ సభ్యులు రాపర్తి రజిత, ఎర్ర అనిత, కస్తూరి కవిత, నక్క పూలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మోదీ స్టీరింగ్.. కార్పొరేట్ల చేతుల్లో ఉంది

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ.అబ్బాస్


సదస్సులో మాట్లాడుతున్న అబ్బాస్

జనగామ రూరల్: ప్రధాని మోదీ స్టీరింగ్ కార్పొరేట్ల చేతుల్లో ఉంది.. దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ పెరుగుతున్నందునే ఎన్డీఏ కూటమికి సీట్లు తగ్గాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ.అబ్బాస్ అన్నారు. 'ఎమర్జెన్సీ నాడు–నేడు' అనే అంశంపై గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా సదస్సులో ఆయన మాట్లాడారు. పెట్టుబడీదారుల ప్రయోజనాలకు అనుగుణంగా ప్రభుత్వాలు పాలన కొనసాగిస్తున్నాయని, ఇందిరా గాంధీ హయాంలో దేశంలో ఎమర్జెన్సీ విధించి రాజ్యాంగం, అందులోని సూత్రాలను విస్మరించిందని అన్నారు. అప్పుడైనా.. ఇప్పుడైనా.. ప్రభుత్వాన్ని నడుపుతున్నది ప్రధానులు కాదు.. పరిపాలనకు డైరెక్షన్ ఇచ్చేది కార్పొరేట్లేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, ఇర్రి అహల్య, సాంబరాజు యాదగిరి, బూడిది గోపి, సుంచు విజేందర్, ఉపేందర్, బిట్ల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మాన్ని కాపాడుకుందాం


బజరంగ్ దళ్ కమిటీ సభ్యులు

నర్మెట: సనాతన ధర్మ పరిరక్షనే ధ్యేయంగా ప్రతీ హిందువు అడుగులు వేయాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా సహ కార్యదర్శి చిలువేరు హర్షవర్ధన్ అన్నారు. మండల కేంద్రంలోని హనుమాన్ దేవాలయంలో గురువారం నిర్వహించిన సమావేశానికి హాజరైన ఆయన మండల బజరంగ్ దళ్ కమిటీ కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. కన్వీనర్‌గా పులి నవీన్, కో కన్వీనర్‌గా ప్రజ్ఞాపురం శ్రీకాంత్, సభ్యులుగా బండి రాకేష్, జశ్వంత్ సాయి, పులి భాను, మహేష్‌లను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేల ఏళ్ల నాటి హిందుత్వాన్ని కాపాడుతూ సనాతన ధర్మ సంరక్షణ, ధార్మిక సేవలు, దేవాలయాల పరిరక్షణ, గో రక్షణ, హిందూ సమాజ చైతన్యం కోసం యువత పాటు పడాలని, మాతృ దేశ పరిరక్షణ కోసం వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ కట్టుబడి ఉన్నాయని అన్నారు. హిందూత్వ పరిరక్షణలో భాగంగా ఇంటింటా ప్రచారం నిర్వహించాలని ఆయన కోరారు.

కాంగ్రెస్ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

- టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి


ఝాన్సీరెడ్డిని సన్మానిస్తున్న క్రాంతికుమార్

కొడకండ్ల: రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. గురువారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని అప్పులమయం చేసిందని, రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నేరవేరుస్తుందన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సురేష్‌నాయక్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు రాజేష్‌నాయక్, రవీందర్, క్రాంతికుమార్, యాకయ్య, సునీల్‌రెడ్డి, మధుసూదన్, నాగరాజు, మోహన్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

'స్థానికం'లో గులాబీ సత్తా చాటాలి


మాట్లాడుతున్న రాము

కొడకండ్ల: రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకుని గులాబీ జెండా సత్తాను చాటాలని మాజీ మార్కెట్ చైర్మన్ పేరం రాము, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సింధె రామోజీలు పిలుపునిచ్చారు. గురువారం రంగాపురం, ఏడునూతుల ఎంపీటీసీ క్లస్టర్ స్థాయి సమావేశాల్లో వారు పాల్గొని మాట్లాడారు. హామీలు నేరవేర్చడంలో కాంగ్రెస్ వైఫల్యాన్ని ప్రజలకు వివరించి కలిసికట్టుగా పార్టీ శ్రేణులంతా ముందుకు సాగాలని వారు కోరారు. ఈ సమావేశాల్లో అభిమన్‌గాంధీ, సోమ రాములు, ప్రభాకర్, వీరస్వామి, భాస్కర్‌రెడ్డి, సతీష్‌గౌడ్, మంగ్యానాయక్ పాల్గొన్నారు.

విజయవంతం చేయండి


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

దేవరుప్పుల: రాష్ట్రవ్యాప్తంగా గిరిజనులకు రాజకీయ, సామాజిక చైతన్యం కల్పించేందుకు తలపెట్టిన శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని సేవాలాల్ సేన మండల అధ్యక్షుడు కునుసోత్ బిక్కునాయక్ అన్నారు. గురువారం మండలంలోని ధారావత్‌తండాలో ఈ నెల 28, 29వ తేదీన హైదరాబాద్ రామంతాపూర్ ప్రగతి నగర్‌లోని డాన్ భాస్కో హాల్‌లో నిర్వహించే శిక్షణ తరగతుల వాల్ పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ ధరావత్ స్వామి నాయక్, రేషన్ డీలర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కూనసోత్ లక్ష్మణ్ నాయక్, మాజీ సర్పంచ్ గేమా నాయక్, రామదాస్ అంబాజీ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్.రాజారెడ్డి


డిప్యూటీ కమిషనర్ గంగాధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జనగామ రూరల్: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్.రాజారెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ డాక్టర్ గంగాధర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2017 సంవత్సరం నుంచి ఇప్పటివరకు సుమారు 300 మందికిపైగా భవన నిర్మాణ కార్మికులకు అందవలసిన సహాయం రాలేదన్నారు. అలాగే 2024 ఆగస్టు నుంచి కొత్తగా కార్డు రావడానికి టెక్నికల్ సమస్య కారణంగా కార్మికులకు గుర్తింపు కార్డులు అందడంలేదని చెప్పారు. అలాగే కొన్ని ఫైల్స్ అనేక కారణాలతో పెండింగ్‌లో ఉంటున్నాయని తెలిపారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘాల జిల్లా అధ్యక్షులు ఆకుల శ్రీనివాస్, పాతూరు సుగుణమ్మ, ఆది సాయన్న తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కమిటీ ఎన్నిక


విశ్వబ్రాహ్మణ సంఘం గ్రామ కమిటీ

రఘునాథపల్లి: మండలంలోని ఖిలాషాపూర్ గ్రామంలో విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విశ్వబ్రాహ్మణ సంఘం పరపతి వార్షిక సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా పుప్పాల కృష్ణమూర్తి ఎన్నిక కాగా కార్యదర్శిగా పుప్పాల సంజీవ, సహాయ కార్యదర్శిగా పుప్పాల చంద్రశేఖర్, గౌరవ సలహా సభ్యులుగా పుప్పాల వెంకటేశ్వర్లు, పానుగంటి లక్ష్మణమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గ్రామ అధ్యక్షుడు మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ కులస్తులు ఐక్యంగా ఉండి తమ హక్కులు సాధించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పుప్పాల రత్నమాచారి, సత్యనారాయణ చారి, బ్రహ్మచారి, ఉదయ్, రాజశేఖర్, అనిల్, ఉప్పోజు చంద్రమౌళి, భత్తోజు రవికుమార్ పాల్గొన్నారు.

పాలకుర్తి టౌన్: విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న పోలీసులు



లింగాలఘణపురం: మానవహారం



రఘునాథపల్లి: ర్యాలీలో ఎస్సై నరేశ్, విద్యార్థులు




జఫర్‌గఢ్ జూనియర్ కళాశాలలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రాజు

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి


చిల్పూరు: ర్యాలీలో పాల్గొన్న ఏసీపీ భీంశర్మ

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా కళాశాలల్లో, పాఠశాలల్లో మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని కోరారు. విద్యార్థి దశలో చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, గంజాయి, డ్రగ్స్ వంటి వాటితో నేడు సమాజంలో జరుగుతున్న దుష్ప్రభావాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు, అధికారులు ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఏసీపీ భీంశర్మ, తహసీల్దార్లు, ఎంఈఓలు, ఉపాధ్యాయులు, పోలీసులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


స్టేషన్‌ఘన్‌పూర్‌లో..

సంక్షిప్త సమాచారం

29న మెగా హెల్త్‌క్యాంపు

దేవరుప్పుల: ఈ నెల 29వ తేదీన మండల కేంద్రంలోని హైస్కూల్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నట్టు ప్రోగ్రామ్ చైర్మన్ మర్రి పట్టాభిరామిరెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండడమేగాక పేదలకు ఉచిత వైద్యసేవలు అదించాలనే సంకల్పంతో అన్ని విభాగాల ప్రముఖ వైద్యులను తీసుకవస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో ప్రొగ్రామ్ కో చైర్మన్ ఈదునూరి నర్సింహ్మరెడ్డి, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గోలి చిన్న ఉప్పల్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, కోశాధికారి ఈదునూరి రామచంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

పాలకుర్తి టౌన్: మొక్కలు నాటి పెంచడంతో పాటు వాటిని సంరక్షించవలసిన బాధ్యత అందరిపై ఉందని ఆలయ ఈఓ సల్వాది మోహన్‌బాబు అన్నారు. రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఆదేశాలతో సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో వనమహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈఓ, అర్చకులు, సిబ్బంది కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, అర్చకులు దేవగిరి లక్ష్మన్న, డీవీఆర్‌శర్మ, దేవగిరి అనిల్‌కుమర్, మత్తగజం నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



తరిగొప్పుల: మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన గుంటి అయిలు మల్లయ్యకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.41,500 చెక్కును కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వగలబోయిన యాదగిరి గురువారం బాధితుడికి అందజేశారు. అనంతరం గ్రామంలోని పలువురు లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు ఇరుమల్ల సమ్మయ్య, చేర్యాల మార్కెట్ ఏఎంసీ డైరెక్టర్ అర్జుల పోషిరెడ్డి, తరాల సమ్మయ్య, శెట్టి సదయ్య, గోరంతల వీరన్న,ఇంద్రారెడ్డి, బ్యాంగి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

పాలకుర్తి టౌన్: గూడూరు గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ వడ్లకొండ ఆండాళ్, ఆమె కుమారుడు శ్రీకాంత్ ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడి హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా, గురువారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వారిని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థిని వైద్యులను అడిగి తెలుసుకుని వారిని ఓదార్చి ధైర్యం చెప్పారు.

మూఢనమ్మకాలపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న సీఐ జానకిరామ్‌రెడ్డి

పాలకుర్తి టౌన్: మూఢనమ్మకాలతో ప్రజలు మోసపోవద్దని. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ చైతన్యవంతులు కావాలని సీఐ జానకిరామ్‌రెడ్డి అన్నారు. గురువారం రాత్రి విస్నూరు గ్రామంలో పోలీస్ జాగృతి కళాబృందం ఆధ్వర్యంలో కళా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలను గ్రామస్తులు, ఉద్యోగుల సహకారంతో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పోలీసు జాగృతి కళాబృందం ఆధ్వర్యంలో మూఢనమ్మకాలు, బ్యాల వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, మత్తు పానీయాల నిషేధంపై ప్రదర్శనలతో పాటు, రోడ్డు ప్రమాదలపై అవగాహన కల్పించారు. ఎస్సైలు లింగారెడ్డి, యాకుబ్‌హూస్సేన్, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.